క్లుప్తంగా

సుంకులమ్మ గుడి చైర్మన్‌కు సన్మానం



చైర్మన్ ఉమామహేశ్వరమ్మ, భర్త నరసింహారెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

గూడూరు రూరల్: కె.నాగలాపురంలోని శ్రీ సుంకులాపరమేశ్వరీదేవి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్‌గా ఎన్నికైన ఉమామహేశ్వరమ్మ, ఆమె భర్త వైఎస్సార్‌సీపీ నాయకుడు నరసింహారెడ్డిని ఆదివారం ఘనంగా సన్మానించారు. గూడూరు నగర పంచాయతీ వైస్ చైర్మన్ పీఎస్ అస్లాం, జిల్లా మైనారిటీ వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ జిలానీ, కేడీసీసీ డైరెక్టర్ పత్తి రంగడు, ముళ్ల బాష, సుధాకర్ తదితరులు వారికి శాలువాలు కప్పి పూలమాల వేసి సత్కరించారు. అదేవిధంగా పలువురు నాయకులు చైర్మన్ ఉమామహేశ్వరమ్మ నివాసంలో మర్యాదపూర్వకం కలిసి అభినందనలు తెలిపారు.

చనుగొండ్లలో కొత్త పింఛన్ల పంపిణీ



కొత్త పింఛన్‌ను లబ్ధిదారుకు అందజేస్తున్న సర్పంచ్ వెంకటేశ్వరమ్మ

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలో ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్లను ఆదివారం సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, మండల కో ఆప్షన్ సభ్యుడు దౌల పంపిణీ చేశారు. గ్రామానికి కొత్తగా 18 పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేయడంతో వారు లబ్ధిదారులకు నగదు అందజేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఆరు నెలలకు ఓసారి ప్రభుత్వం కొత్త పింఛన్లను మంజూరు చేస్తుందని, వృద్ధులు, వితంతువులు, వికలాంగులు దరఖాస్తు చేసుకోవాలని సర్పంచ్ సూచించారు.

నేడు శ్రీకొండలరాయుడికి తేళ్లే నైవేద్యం



కోడుమూరు రూరల్ : కోడుమూరులోని కొండ మీద వెలసిన శ్రీకొండలరాయుడికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సంరక్షకుడు మనోహర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. శ్రావణమాసం మూడవ సోమవారం కోడుమూరు కొండపై వెలసిన శ్రీకొండలరాయుడు స్వామి వారికి ప్రజలు తేళ్లే నైవేద్యంగా సమర్పించి పూజలు నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత. ప్రజలు కొండపైకి విచ్చేసి స్వామివారికి నిర్వహించే ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

6 నుంచి గోకులాష్టమి వేడుకలు



శ్రీ వీరనారాయణస్వామి మూలవిరాట్

పాణ్యం: స్థానిక శ్రీ వీరనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 6వ తేదీ నుంచి గోకులాష్టమి వేడుకల ప్రారంభమవుతున్నట్లు ఈఓ లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 6వ తేదీన శ్రీవారి కల్యాణం ఉంటుందన్నారు. 7న స్వామి వారికి కై ంకర్యాలు జరుగుతాయన్నారు. 8న మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం ఉత్సవ మూర్తుల గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

5న ఉచిత గుండె, కంటి వైద్య శిబిరం

కోడుమూరు రూరల్: స్థానిక శ్రీరాములస్వామి ఆలయంలో ఈనెల 5న వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఆధ్వర్యంలో ఉచిత గుండె, కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్ఎస్‌కే సమాజ్ సభ్యులు జీతూరి రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో ఉచితంగా గుండె, బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలతో పాటు, కంటి పరీక్షలు నిర్వహించి మందులను అందజేస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతికి ఎమ్మెల్యే సంతాపం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం ఎదురూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఈడిగ వెంకటేశ్వర్లు గౌడు (55) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎదురూరులోని వెంకటేశ్వర్లు గౌడు నివాసానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులు అశ్వర్థామ, రామాంజనేయులు, ఓ కుమార్తె శశిరేఖ సంతానం. కాగా 15 ఏళ్ల క్రితం అశ్వర్థామ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ధైర్యం చెప్పి ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీ వర్షం.. పైర్లకు ప్రాణం

- పొంగిపొర్లిన వాగులు
- పొలాల్లో నిలిచిన వర్షపునీరు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

పాణ్యం : మండలంలో ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. వర్షపు నీటి ధాటికి వాగులు, వంకలు ఏకమైయ్యాయి. పొలాల్లో భారీగా వర్షపు నీరు నిలవడంతో పైర్లకు ప్రాణం పోసినట్లయ్యింది. దీంతో రైతులు కళ్లలో ఆనందం నెలకొంది. రోడ్లపై నీరు పారడంతో పలు గ్రామాలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అధికారులు లెక్కల ప్రకారం మండలంలో 57.25 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. తెల్లవారు జామున 2గంటలకు మొదలుకొని ఉదయం 6.30గంటల వరకు వాన కురిసింది.

ఊపిరి పీల్చుకున్న రైతున్న

నెల రోజులుగా చినుకు జాడలేక రైతులు అల్లాడుతున్నారు. పుష్కలంగా పొలాలు పదును అయ్యేలా వర్షం కురవకపోవడంతో ఈ ఖరీఫ్ ప్రశ్నర్థకంగా మారింది. మరి కొందరు రైతులు ధైర్యం చేసి సాగు చేశారు. కానీ చినుకు జాడ కానరాక ఆశల వదులుకున్న తరుణంలో ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి పొలాల్లో నీరు నిలిచింది. ఉదయం పొలాలను చూసిన రైతుల్లో ఆశలు చిగురించాయి. సాగు చేసిన పంటలకు ఈ వర్షం రాక ప్రాణం పోసిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గడివేములలో మొక్కజొన్న పంటలో వర్షపు నీరు నిల్వ ఉన్న దృశ్యం



అహల్యాపురం వద్ద కొర్రవాగు ఉధృంతగా ప్రవహిస్తున్న దృశ్యం

రాకపోకలకు అంతరాయం

మద్దూరు-కొత్తూరు గ్రామాల మధ్య ఉన్న నంది వాగుపై వరదనీరు భారీగా చేరడంతో రాకపోకలు తీవ్ర అంతయారం ఏర్పడింది. దీంతో కొత్తూరు దర్శనానికి వెళ్లే భక్తులు అవస్థలు పడ్డారు. వరద నీటిలోనే రోడ్డును దాటారు. అలాగే కొత్తూరు ముందు ఉన్న కుమ్మరోని వాగుకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. రాయపాడు-గగ్గటూరు గ్రామాల మధ్య ఉన్న ఊరుముందిర వాగుపై నీరు ప్రవహించడం వల వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అలమూరు-రామతీర్థం గ్రామాల మధ్య ఉన్న వాగుపై నీరు చేరవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కౌలురు గ్రామం ముందు ఉన్న కానుగల వాగుపై కూడా వరదనీరు ప్రవహించింది.

గడివేములలో 74 మిల్లిమీటర్ల వర్షపాతం

గడివేముల: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ఇంత పెద్ద వర్షం కురవలేదు. ఆదివారం అర్ధరాత్రి నుంచి కురిసిన వర్షాలకు పంట పొలాలు నీట మునగడంతో పాటు, మండలంలోని కుందు, మద్దిలేను వాగులు ఉధృతంగా ప్రవహించాయి. మండలంలో 74 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. మెట్ట ప్రాంతాలలైన ఒండుట్ల, ఎల్‌కే తండా, గని, బొల్లవరం, తిరుపాడు గ్రామాలలో సాగు చేసిన పత్తి, సోయా చిక్కుడు, మొక్కజొన్న పంటలు ఎండిపోతున్న సమయంలో పడిన భారీ వర్షం ఊపిరి పోసినట్టైందని అన్నదాతలు చెబుతున్నారు. పంట పోలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో రైతులు పోలాలకు వెళ్లి నీటిని లోతట్టు ప్రాంతాలకు వదులుతున్నారు.



అలమూరు-రామతీర్థం గ్రామాల మధ్య బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరదనీరు



బూజునూరు గ్రామంలో నీటమునిగిన మిరప పంట



అనుపూరు వద్ద పొలాల్లో నిల్వ ఉన్న నీరు



రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

తూనిక యంత్రాలకు సీళ్లు వేయించుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ పీవీఎం.పరమేశ్వర కుమార్

కర్నూలు (న్యూసిటీ) : వ్యాపారులు ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలకు సకాలంలో సీళ్లు వేయించుకోవాలని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పీవీఎం.పరమేశ్వర కుమార్ తెలిపారు. ఆదివారం కల్లూరులోని షాపులను తనిఖీ చేసి యంత్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. 100 ఎలక్ట్రానిక్ యంత్రాలకు సీళ్లు వేశామన్నారు. వ్యాపారులు ఎలక్ట్రానిక్ యంత్రాలకు సంవత్సరానికి ఒక సారి సీళ్లు వేయించుకోవాలని సూచించారు. పాత యంత్రాలను వాడితే తూకాల్లో తేడా వస్తుందని, సీళ్లు లేకుండా యంత్రాలను ఉపయోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు వ్యాపారులు మోసం చేయడానికి అరిగిపోయిన కాటా రాళ్లు ఉపయోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వాటిని మార్చుకోవాలని సూచించారు.

విత్తన ఎంపికపై అవగాహన పెంచుకోండి

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయంలో విత్తనం ఎంపికనే అత్యంత కీలకమైనదని, మంచి విత్తనానికి ఉండవలసిన లక్షణాలపై అవగాహన పెంచుకోవాలని నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం విశ్రాంత సీడ్ టెక్నాలజీ అధికారి రామరాజు ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో దేశీ డిప్లొమో కోర్సులో భాగంగా ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సమన్వయకర్త, విశ్రాంత జేడీఏ జయచంద్ర ఆధ్వర్యంలో జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... నాణ్యమైన విత్తనానికి ఉండవలసిన లక్షణాలు, విత్తన రకాలు, రైతులు విత్తనాలు ఎంపిక చేసుకునే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. విశ్రాంత జేడీఏ జయచంద్ర మాట్లాడుతూ.. రైతులకు మన ప్రాంతానికి అనువైన, ధ్రువీకరించిన విత్తనాలను మాత్రమే విక్రయించాలని సూచించారు.

సమాజ శ్రేయస్సుకు కంకణ బద్ధులు కండి

కర్నూలు కల్చరల్: సమాజ శ్రేయస్సుకు కంకణ బద్ధులు కావాలని ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు పిలుపునిచ్చారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక ఇస్కాన్ జగన్నాథ మందిరంలో ఆదివారం శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణా తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు సర్వ దర్శనం కల్పించారు. మహారాజ భోగ నివేదన చేశారు. ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణతో పాటు దేశభక్తి కలిగి ఉండాలన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం



ప్రజలకు విక్రయించిన పంట ఉత్పత్తులు

ఓర్వకల్లు: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేసిన పంట ఉత్పత్తులను ఆదివారం మండల కేంద్రమైన ఓర్వకల్లు మార్కెట్‌లో విక్రయించినట్లు యూనిట్ ఇన్‌చార్జ్ శివకుమార్ తెలిపారు. మండలంలోని హుసేనాపురం గ్రామానికి చెందిన జన్మభూమి గ్రామైక్య సంఘం సభ్యురాలు సుగాలి వెంకటరమణ భార్య వీరభద్రమ్మబాయి తమకున్న ఎకరా పొలంలో ప్రధాన పంటగా దేశీ పత్తి పంటతో పాటు, అంతర పంటగా 36 రకాల ఆకుకూరలు, కూరగాయలను ప్రకృతి విత్తనాలను విత్తి, ఘన జీవామృతం, ద్రవజీవామృతం ఎరువులతో సాగు చేసింది. అందులో గోంగూర, తోటకూర, బెండ, చౌళ వంటి పంట ఉత్పత్తులను బహిరంగ మార్కెట్‌లో ప్రజలకు అమ్మినట్లు తెలిపారు. ఇలాంటి పంట ఉత్పత్తులను వాడడం వల్ల ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా వుంటారని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఎగ్జిక్యూటీవ్ మోహన్, ఎస్ఎఫ్ఏ మల్లికార్జున, మాస్టర్ ట్రైనర్ ఆంజనేయులు, యూనిట్ మేనేజర్లు శివ, హుసేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

నిరాశపరచిన వరుణుడు

కోడుమూరు రూరల్ : ఖరీఫ్ సీజన్ కింద సాగు చేసిన పంటలు చేతికొస్తున్న తరుణంలో వర్షాలు కురువకుండా బెట్ట పెట్టడంతో ఎండిపోయే దశకు చేరుకున్నాయి. రెండు రోజుల నుంచి ఆకాశం మబ్బులు పట్టి చిన్న పాటి చినుకులు పడుతున్నాయే తప్పా మంచి వర్షాలు కురువడం లేదు. దీంతో రైతులు నిరాశకు గురువుతున్నారు. ఖరీఫ్ సీజన్ కింద ఈ ఏడాది మండలంలో దాదాపు 9,860వేల ఎకరాల్లో రైతులు పత్తి, కంది, వేరుశనగ, సజ్జ, కొర్ర, ఉల్లి తదితర పంటలను సాగు చేశారు. ప్రస్తుతం పంటలకు వర్షాలు అవసరమైన తరుణంలో వరుణుడు కరుణించడం లేదు. విపరీతమైన ఎండల మూలంగా పంటలు ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి. ముఖ్యంగా వర్షాధారం కింద సాగు చేసిన ఉల్లి పంట వానల్లేక భారీగా దెబ్బతింటోంది. మరో నాలుగైదు రోజుల్లో వానలు పడకపోతే పూర్తిగా ఎండిపోయే పరిస్థితి నెలకొంది. గత రెండు రోజుల నుంచి ఆకాశం మబ్బులు పట్టి చిన్న పాటి చినుకులు పడుతున్నాయే తప్పా మంచి వర్షాలు కురియడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వానల్లేక వడలిపోయిన కంది పైరు

మంచి సాహిత్యంతో ఆరోగ్యం పదిలం



డాక్టర్ జాగర్లపూడి శ్యామసుందరశాస్త్రిని సన్మానిస్తున్న ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్, సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): మంచి సాహిత్యం చదవడం వల్ల మానసిక ఆరోగ్యం వృద్ధి చెంది ఆరోగ్యం పదిలమవుతుందని అనంతపురం ఆలిండియా రేడియో సీనియర్ అనౌన్సర్ డాక్టర్ జాగర్లమూడి శ్యామసుందరశాస్త్రి అన్నారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో 'సాహిత్యం-హృదయం' అనే అంశంపై ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ప్రతి ఒక్కరికీ పుస్తకాలు చదివే అలవాటు ఉండేదని, అందులో మంచి సాహిత్యం గల పుస్తకాలపై ఆసక్తి చూపించేవారన్నారు. పుస్తకాలు చదవడం వల్ల భాషా ప్రావీణ్యంతో పాటు మంచి జ్ఞానం కూడా వృద్ధి చెందుతుందని అన్నారు. మంచి సాహిత్యం చదవడం వల్ల మనసుసుకు ఎంతో ఆహ్లాదంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ మంచి పుస్తకాలను నిత్యం చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం ఆయనను హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ, ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

సాహిత్య పురస్కార గ్రహీతలకు సన్మానం



సాహిత్య పురస్కార గ్రహీతలను సన్మానం చేస్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: రాష్ట్ర స్థాయి హంస, గిడుగు సాహిత్య పురస్కార గ్రహీతలను ఆదివారం ఘనంగా సన్మానించారు. మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో జరిగిన కార్యక్రమంలో హంస పురస్కార గ్రహీత ఎస్.డి.వి. అజీజ్, గిడుగు సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ ఎం. హరికిషన్‌లకు పలువురు సాహితీ వేత్తలు సన్మానించారు. ఈ సందర్భంగా గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు చంద్రశేఖర కల్కూర మాట్లాడుతూ రచనలు సామాజిక ప్రయోజనాలివ్వాలన్నారు. ప్రాచీన ఆధునిక సాహిత్య, చరిత్ర నిర్మాణం, సాహిత్యంలో కర్నూలుకు విశిష్ట స్థానం ఉందన్నారు. కార్యక్రమంలో సాహితీ వేత్తలు వెంకట కృష్ణ, మారుతి, కెంగార మోహన్, జేఎస్ ఆర్కేశర్మ, ఇనాయతుల్లా, చౌశా, నాగేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

టైలర్ల సంక్షేమానికి కృషి



రాష్ట్ర మహా సభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: టైలర్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర టైలర్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ షేక్ సుభాన్‌బీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సమా వేశ మందిరంలో కర్నూలు జిల్లా టైలర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ అర్హులైన టైలర్లకు ప్రభుత్వం రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించడం ముఖ్యమంత్రి గొప్పతనమన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విక్కీ నాగేశ్వరరావు మాట్లాడుతూ టైలర్ల రాష్ట్ర మహాసభను ఈనెల 17వ తేదీన ఒంగోలులో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మహాసభకు కార్యవర్గ సభ్యులతో పాటు టైలర్లు అందరూ హాజరు కావాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు ఖలీల్ బాష అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు మహబూబ్ బాషా, వేణుగోపాల్, సుభాన్, జిల్లా కార్యదర్శి సైపుల్లా, కోశాధికారి ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు పోలీసు స్టేషన్‌కు చిత్తూరు జిల్లా టీడీపీ నేతలు

కర్నూలు (టౌన్): చిత్తూరు జిల్లాకు చెందిన తెలుగు దేశం పార్టీ నేతలు ఆదివారం కర్నూలు మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో హాజరయ్యారు. గత నెలలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డు చిత్తూరు జిల్లా అంగళ్లలో పర్యటించారు. ఈ సందర్భంగా పోలీసులకు, టీడీపీ నాయకులు, కార్యకర్తల మధ్య గొడవ జరిగింది. రెచ్చిపోయిన టీడీపీ నాయకులు పోలీసులపై దౌర్జన్యం చేయడంతో పాటు తీవ్రంగా గాయపరిచారు. రాళ్లు కర్రలతో పోలీసులపై దాడులు చేయడంతో ఒక పోలీసు కంటిచూపు కోల్పోయాడు. దీంతో స్పందించిన ప్రభుత్వం నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ ఘటనలో తెలుగు దేశం పార్టీ పీలేరు ఇన్‌చార్జ్ నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి, పార్టీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పులపర్తి నానిలు నిందితులుగా ఉన్నారు. వీరు ఇప్పటికే కోర్టును ఆశ్రయించారు. వీరికి కండిషన్ బెయిల్ ఇస్తూ ఏదో ఒక పోలీసు స్టేషన్‌లో హాజరు కావాలని కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో ఆదివారం వీరిద్దరూ కర్నూలు మూడోపట్టణ పోలీసు స్టేషన్‌లో హాజరయ్యారు.

వార్డెన్‌పై విచారణ జరిపించండి

కర్నూలు(అర్బన్): నగరంలోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల విద్యార్థినుల వసతి గృహం నెంబర్. 2లో చోటు చేసుకుంటున్న ఘటనలకు సంబంధించి వార్డెన్‌పై విచారణ జరిపించాలని ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, మైనారిటీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీ రాజీవ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ జే రంగలక్ష్మిదేవికి వినతి పత్రం అందజేశారు.

జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలి



పతకాలు సాధించిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు (టౌన్): రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు ఇదే స్ఫూర్తితో జాతీ య స్థాయిలోనూ రాణించాలని ఉషు సంఘం జిల్లా చైర్మన్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఇటీవల ప్రకాశం జిల్లా చీమకుర్తిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు 12 బంగారు, 4 వెండి 16 కాంస్య పతకాలు సాధించారు.ఈ సందర్భంగా ఆదివా రం స్థానిక పెద్దమార్కెట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినంద న కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కరాటే , ఉషూ వంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడలు ఆరోగ్యంతో పాటు ఆత్మరక్షణకు ఉపయోగపడతాయన్నారు. అనంతరం పతకాలు సాధించిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

బంగారు పతకాలు సాధించడం హర్షణీయం



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న తాలూకా సీఐశ్రీరామ్

కర్నూలు (టౌన్) : గత నెల 26, 27 తేదీల్లో బెంగళూరులో నిర్వహించిన వెస్టన్ కప్ మొద టి జాతీయ ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు తైక్వాండో క్రీడాకారులు ప్రతిభ చాటారు. కర్నూలు నగరానికి చెందిన తైక్వాండో క్రీడాకారులు క్యూరొగ్, పూమ్‌సే, డెమో పోటీల్లో సుగంధిని, మౌనిక, రాధిక, విభ, సాధికా సందీప్, రంజిత్, రెహన్, సుహాస్, రేవంత్‌లు బంగారు పతకాలు సాధించారు. ఆదివారం స్థానిక వీకర్‌సెక్షన్ కాలనీలోని మున్సిపల్ పార్కులో తాలుకా సీఐ శ్రీరామ్ పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు జి.షబ్బీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కల్లూరు: మండల పరిధిలోని ఏ.గోకులపాడు గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారన్నారు. మండల స్థాయి అధికారులు నివేదికలతో కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

9 నుంచి కర్నూలు మండలంలో..

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 9వ తేదీ నుంచి 24 తేదీ వరకు కర్నూలు మండలంలోని జి సింగవరం, గార్గేయపురం, రేమట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఎంపీడీఓ అజాం ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారన్నారు. ఈ నెల 9, 10వ తేదీల్లో జి సింగవరం , 19, 20, 21, 22వ తేదీల్లో గార్గేయపురంలో, 23, 24వ తేదీల్లో రేమట గ్రామంలో నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు.

నేడు ప్యాలకుర్తిలో గడప గడపకు మన ప్రభుత్వం

కోడుమూరు రూరల్ : మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరిస్తారన్నారు. అదేవిధంగా ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు తీసుకుంటారని చెప్పారు. మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటరీలు పాల్గొనాలని ఎంపీడీఓ సూచించారు.

'స్పందన'తోనే సమస్యల పరిష్కారం

కర్నూలు (న్యూటౌన్): ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే స్పందనతోనే సమస్యల పరిష్కారమవుతాయని కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజలు అర్జీ రూపంలో ఇస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. స్పందన కార్యక్రమానికి మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

నేడు కోడుమూరులో స్పందన

కోడుమూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయన్న ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీలు సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

నేడు స్పందన

గూడూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహశీల్దార్ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహించే ఈ కార్యక్రమానికి అధికారులు హాజరు కావాలని సూచించారు.

నిధుల మళ్లింపు నిర్ణయాన్ని విరమించుకోవాలి

కర్నూలు (టౌన్): సీఎస్ఐ చర్చిలో కానుకల రూపంలో ఉన్న రూ. 50 లక్షలు నిధులను మళ్లించాలని బిషప్ తీసుకున్న నిర్ణయాన్ని తక్షణం విరమించుకోవాలని సీఎస్ఐ చర్చి పాస్టరేట్ సభ్యులు బాబు రాజు, మనోహర్ బాబు, బెనడిక్ట్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం చర్చి ప్రాంగణంలో ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. అలాగే చర్చి పాస్టర్ డినరీ చైర్మన్ రెవరెండ్ శామ్యూల్ రత్నరాజ్ కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం కానుకల రూపంలో సమకూర్చిన రూ.50 లక్షలను ఇతర పనులకు మళ్లించడం తగదన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు ప్రవీణ్, జోయల్,రాజ్‌కుమారి, లలిత, సులోచన తదితరులు పాల్గొన్నారు.

సుంకేసులలో 0.581 టీఎంసీల నీరు

గూడూరు: సుంకేసుల జలాశయం నుంచి కేసీ కాల్వకు నీటి విడుదల నిలిపేసినట్లు ఆదివారం డ్యామ్ అధికారులు తెలిపారు. జలాశయానికి ఇన్‌ఫ్లో నిలిచి పోయిందని, ప్రస్తుతం 0.581టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

గూడూరులో 11.4 మి.మీ వర్షం

గూడూరు: మండలంలో ఆదివారం 11.4 మిమీ వర్షం పాతం నమోదైంది. ఈ వర్షం ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ఊరట నిచ్చింది. ఎండుతున్న పంటలకు ప్రాణం వచ్చినట్లు అయిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తైక్వాండో ఉచిత శిక్షణను వినియోగించుకోండి

కర్నూలు (టౌన్) : తైక్వాండో ఉచిత శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలని తైక్వాండో శిక్షకులు వెంకటేశ్వర్లు అన్నారు. ఇటీవల హైదరబాదులో నిర్వహించిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో కర్నూలు నగరానికి చెందిన వెంకటేష్, రోహిత్, నాగరాజు కుకువన్ బ్లాక్‌బెల్ట్ సాధించారు. డాన్-1, డాన్-2 సాధించిన క్రీడాకారులకు ఆదివారం సాయంత్రం స్థానిక వెంకటచలపతి కల్యాణ మండపంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారుల్లో ఈ క్రీడ పట్ల ఆసక్తి పెంచేందుకు ఉచితంగా నగరంలొని వివిధ ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నామన్నారు.